పాలగుమ్మి పద్మరాజు


# దారి తప్పిన బస్సు

రామలింగం మేష్టారికి తన సొంత పిల్లల్ని ఇద్దరినే అదుపులో పెట్టడం చేతకాదు ఆయన ఖర్మానికి పాతిక మంది కోతి మూకని ఎక్స్‌కర్షన్ తీసి కెళ్ళవలసిన పని పడింది. సుబ్బయ్య నాయుడు ఉబ్బసం అని తప్పించుకున్నాడు. వెంకటరెడ్డి తన పెళ్ళానికి పురుడొచ్చే రోజులని సెలవు పెట్టాడు, పెద్ద ఆయనే నొప్పులు పడవలసినట్టు. రామకృష్ణ చౌదరి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు దసరా సెలవులు మొదలయ్యేసరికి, బుల్లిపాలెం ప్రాథమిక పాఠశాల మేష్టర్లలో మిగిలింది తను, హెడ్ మేస్టారు. పులిమీద పుట్రలాగా ఈ అంతర్జాతీయ శిశు సంవత్సరం ఒకటి వచ్చి పడింది. ఈ కుర్రకుంకల్ని హంపీ తీసుకుపోవాలట. అక్కడి శిథిలాలు చూసి, గతించిన విజయనగర సామ్రాజ్యం తాలూకు గొప్పతనం అవగాహన చేసుకుంటారట. పుస్తకాల్లో బొమ్మల్లో శిథిలాలున్నాయి, వాటి వర్ణన ఉంది. ఆ చరిత్ర అంతా స్పష్టంగా రాసిఉంది. చదువుకుని ఏడవకూడదూ? ఏవిటో రక రకాల కొత్త సిద్ధాంతాలొచ్చి పడ్డాయి. విద్యా విధానంలో, మాష్టర్ల చావుకి. ఒక్క కుర్రరాక్షసి వీపుచిల్లెయ్యడానికి వీల్లేదు గదా. ఏమయితేనేం, ఈ అధికమాసపు తద్దినం తనకి తప్పలేదు.

ఉదయం ఎనిమిదింటికి బుల్లిపాలెం నించి బయలుదేరవలసిన టూరిస్టుబస్సు స్కూలు దగ్గరకు వచ్చేసరికే పదిన్నర యింది. పిల్లల్ని వాళ్ళ పెట్టెబేడల్ని, వంటమనిషినీ సామగ్రినీ ఎక్కించి బస్సు కదిలేసరికి పదకొండున్నర.

బస్సులో రేడియో ఉంది. అందులోంచి సినీమాపాటలొస్తున్నాయి. కిష్టప్పగాడు మరో నలుగురు నడుస్తున్న బస్సు మధ్య నిలబడి గంతులు. సరే, పడిపోతే బస్సు లోపలేగా పడేది. రామలింగం మేస్టారు సీట్లో వెనక్కి జేర్లబడి కళ్ళు మూశారు. నలభైఏభై మంది సంతగోల చేస్తున్న క్లాసులోనే గుర్రుపెట్టి నిద్రపోగల యోగసాధన ఆయనకుంది. పైగా బస్సు ఇంజను మోత జోకొడుతోంది, కిటికీలోంచి చల్లని కొండగాలి వీవన వీస్తోంది. మేస్టారు నిద్రపోయారు.

బస్సు ఆగిన కుదుపుకి మేస్టారు ముందుకు పడబోయి మేలుకుని విలదొక్కుకున్నారు. పిల్లలు బిల బిల గంతులేస్తూ దిగిపోయారు. వంటవాడు జంబుఖానాలు దారి పక్కన పచ్చికమీద పరిచాడు. రామలింగం మేస్టారికి ఒకటే కంగారు, ఈ కొండదారుల్లో ఎక్కడ ఎవరు తప్పిపోతారో, ఎవరు పారిపోతారోనని. దిగే పిల్లల్ని తిరిగి లెక్కపెట్టారు మేస్టారు. కిష్టప్ప ఒక కొండ కొమ్మమీదికి ఎక్కుతుంటే, సుబ్బిగాడు, వెంకటం, గౌరి వెంటపడుతున్నారు. మేస్టారు అరిచారు అలాంటి కోతిపనులు చెయ్యొద్దని. ఈ కిష్టప్పగాడు కేవలం కిష్కింధాపురి అగ్రహారీకుడు. వాడు ఈ కోమూతికకి లీడరు కూడా. వాణ్ని ఓ కంట కనిపెట్టి చూడకపోతే, కొంప మునుగుతుంది. ఆయన, వంటవాడు, డ్రైవరు తలో మూలనించీ తరిమి, మేకల మందని మైదానంలోకి చేర్చినట్టు పిల్లల నందరినీ జంబుఖానాల మీదికి చేర్చేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. ఆ తరవాత వాళ్ళకి బిస్కట్లు, కూల్ డ్రింక్సు సరఫరా. ఫరవాలేదనుకుని మేస్టారు రవంత ఈతిబాధ తీర్చుకోడానికి ఒక బండరాతి పక్కకి వెళ్ళి తిరిగొచ్చేసరికి, కిష్టప్ప మరో నలుగురు గల్లంతు. వెతగ్గా వెతగ్గా, వాళ్ళు ఒక కొండవాల్లో ఉన్న చెట్టెక్కి సీతాఫలాలు కోస్తున్నారు. వాళ్ళని నాలుగు తిట్టి బెదిరించి, బస్సులో ఎక్కించేసరికి గంటన్నర పట్టింది. బస్సు కదిలింది. కిష్టప్ప సందేహం: సీతాఫలాలు వర్షాకాలంలోనూ, మామిడి కాయలు వేసవిలోనూ ఎందుకు కాస్తాయి, అని. తనకి మాత్రం ఏం తెలుసు? అయినా తెలీదంటే మేస్టారిమీదఉన్న గౌరవం కూడా పోతుంది. అందుకని, దేవుడు అలా ఏర్పాటు చేశాడని పోటీలేని సమాధానం చెప్పారు. ఈ కుర్రాళ్ళందరికీ అనుమానాలు అంటువ్యాధిలా పుట్టుకొస్తాయి. వరసగా అడగడం మొదలు



పెట్టారు. ఇంత ఎత్తు కొండమీద నీళ్ళు వుండవుగదా మొక్క లెలా మొలుస్తున్నాయని ఒకడు. వర్షాలు కురుస్తాయిగా అని మేస్టారి సమాధానం. కురిస్తే అవన్నీ కొండ కిందికి పారి వెళ్ళిపోతాయిగదండీ? అని ఇంకొకడి ఎదురుప్రశ్న. కిష్టప్ప కొంటెగా, దేవుడు కిందినించి వాటికి నీళ్ళు ఏర్పాటు చేస్తాడని జవాబు చెప్పాడు. ఇది తామర తంపరగా ప్రశ్న సమాధానాల గొలుసుకట్టుగా ఆనందంగా సాగిపోయేదే. డ్రైవరు రేడియో మోగించాడు. సినిమాపాట లొస్తున్నాయి. వాటి వ్యామోహంలో పడి పిల్లలు అయన్ని మరిచిపోయారు. ఆయన వాళ్ళనీ మరిచిపోయి, హాయిగా గుర్రు నిద్రలో మునిగిపోయాడు.

ఆ గుర్రు నిద్రలో ఓ కల.

చటుక్కున బస్సు తేనెపట్టులా మారిపోయింది. పిల్లలంతా తేనెటీగలు. అందులో గౌరి రాణీ ఈగ. తను మాత్రం చెట్టుమీద నిలబడిపోయాడు. ఇన్ని తేనెటీగల్ని ఎలా పట్టడం? తేనె పట్టు చిటారుకొమ్మన ఉంది. డ్రైవరు తనకేం పట్టనట్టు ఒక బండరాయిమీద కూర్చుని బీడీ కాల్చుకుంటున్నాడు. వంటవాడు కనబడ్డంలేదు. పిల్లలంతా ఇలా అయిపోయారంటే, బుల్లిపాలెం ఊరంతా కలిసి తన్ను కొరతవేస్తారు. తేనెటీగల్ని బతిమాలాడు - తేనెపట్టు కిందికి దింపి దాన్ని మళ్ళీ బస్సుగా మార్చెయ్యమని, తమందరు తిరిగి పిల్లలుగా మారిపొమ్మని. పెద్ద తేనెటీగ, కిష్టప్పగాడి మొహంతో తన చుట్టూ నవ్వుతూ ఎగిరింది. చెయ్యి విసిరారు, కొట్టబోయారు, పట్టుకోబోయారు. చురుక్కున ఒక పోటు పొడిచి కిష్టప్పగాడు ఎగిరిపోయాడు. కోపం వచ్చింది మేస్టారికి. ధైర్యంచేసి చెట్టెక్కారు చిటారు కొమ్మదాకా. చెయ్యి జాపారు. పట్టు అందుకోడానికి. అంతే పిల్ల తేనెటీగ




లన్నీ ఒక్క పెట్టున చేతిచుట్టూ మూగి కుంటూ చెయ్యి వెనక్కి లాక్కున్నారు. కొన్ని వందల అడుగులు. తేనెటీగలు కుట్టడం మొదలెట్టాయి. 'అబ్బ' అను పట్టు తప్పింది. కింద పడిపోతున్నారు, మాత్రం కుడుతూనే ఉన్నాయి చేతివి.

'కెవ్వు' మని అరుస్తూ లేచారు రామలింగం మేస్టారు. 'తేలు కుట్టిందేమో' అన్నాడు కిష్టప్ప. తేలు కోసం వెతకడం మొదలెట్టారు పిల్లలు బాటరీ లైట్లువేసి. పూర్తిగా తెలివొచ్చింది మేస్టారికి. తను బస్సులోనే ఉన్నాడు పక్క కిటికీలోంచి సన్నజల్లు చురుకు చురుకుమని చేతిమీద పడుతోంది. 'తేలు లేదు ఏంలేదు, కూచోండి' అని అరిచి, మేస్టారు పక్క కిటికీ అద్దం దింపేశాడు. అప్పు డాయనకి అర్థమైంది, చీకటి పడుతోందని, అవతల గాలీ, సన్న జల్లూ ప్రారంభ మైందని.

రోడ్డు చూస్తే ఆయనకి అనుమానం వచ్చింది.

'తారురోడ్డులా లేదే' అన్నారాయన.

'అడ్డుదారి.' అన్నాడు డ్రైవరు.

'ఎక్కడి కెడుతుందీ అడ్డుదారి?'

'మళ్లా ధర్మారం మేన్ రోడ్డులో కలుస్తాదంట, 12 మైళ్ళు కలిసొత్తాదంట.'

ఏడు గంటలకి ధర్మారం చేరాల్సింది. టైం చూస్తే పావు తక్కువ ఏడు. మళ్ళీ వెనక్కి జేర్లబడ్డారు రామలింగం మేస్టారు - పిల్లలు కొందరు నిద్ర పోతున్నారప్పుడే. కిష్టప్ప మరికొందరు ఏవో పాటలు పాడుతున్నారు.ఏడయింది. రోడ్డు మరింత అధ్వాన్నంగా ఉంది. కొండదారి. మలుపులు బస్సుదీపాల వెలుగులో అస్తవ్యస్తంగా కనబడుతున్నాయి. పరిసరాలు. బస్సు పరుగెత్తడంలేదు. పాకుతోంది. ఎనిమిదయింది. అప్పటికీ మెయిన్‌రోడ్డు రాలేదు సరిగదా, పల్లె కూడా తగల్లేదు.వాన జోరు హెచ్చింది.

'ఏం దారయ్యా ఇది. నీ మొహం అడ్డుదారి.' అన్నారు మేస్టారు.

'దారి తప్పినట్టున్నామండి. ఆ మడిసి సెప్పిన ఊరేదీ తగల్లేదు,' అన్నాడు వంటవాడు.

'బస్సు వెనక్కి తిప్పు. నీ మొహం లాగుంది. నీ అడ్డదార్లూ నువ్వూ.'

'చక్కని రాజమార్గముండగా,' అని పాడాడు కిష్టప్ప.

'బస్సు తిరగదండి, ఓ పక్క కొండ, ఓ పక్క ఎయ్యి అడుగుల లోయ,' అన్నాడు డ్రైవరు.

రామలింగం మేస్టారికి ఓ పక్క కోపం, రెండో పక్క భయం. ఇంత మంది పిల్లలతో ఈ బస్సు సురక్షితంగా మనుషులుండే చోటికి చేరితే చాలునని వెయ్యి దేవుళ్ళను మొక్కుకున్నారు. గట్టిగా డ్రైవర్ని తిట్టడానికే భయం వేసింది. ఇంతమంది ప్రాణాలూ వాడి చేతిలో ఉన్నాయి.

తొమ్మిదింబావు. బస్సు రెండుసార్లు గుంజి ఆగిపోయింది. రామలింగం మేస్టారి ప్రాణాలు పైకి పోయాయి. ఇప్పుడేవిటి గతి? డ్రైవరు బోనెట్ ఎత్తి బాటరీలైట్లు సహాయంతో ఇంజిన్ చూస్తున్నాడు. నిద్రపోతున్న పిల్లలంతా మేలుకున్నారు. ఆడపిల్లలు మగ పిల్లల్లో పిరికివాళ్ళు ఏదో పెద్ద ప్రమాదం జరగబోతున్నట్టు వాణికిపోతున్నారు. కిష్టప్ప, సుబ్బు బస్సు దిగారు. వొద్దన డానికి కూడా నోరురాలేదు రామలింగం మేస్టారికి. వాళ్ళు కొండమీదికి ఎక్కుతుంటే ఆయన గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

'మేస్టారూ,' అదుగో ఏదో దీపం. పెద్ద ఇల్లులా వుంది,' అని అరిచాడు కిష్టప్ప.

బిలబిల పిల్లలంతా దిగారు. పిరికి వాళ్ళు ధైర్యవంతుల చేతులు పట్టుకున్నారు,చీకట్లో ఎక్కడ తప్పిపోతామో అన్నట్టు. కిష్టప్ప, సుబ్బు కొండదిగి వచ్చారు.

'మేస్టారూ! ఈ మలుపు తిరిగితే ఏదో ఇల్లుందండి. దీపం ఉంది లోపల' అన్నాడు కిష్టప్ప.

'బస్సు కేమయింది' అని అడిగారు మేస్టారు.

'డెల్కోలోకి నీళ్లెళ్లిపోయాయ్. ఈ వానలో కదల్దు' అన్నాడు డ్రైవర్.

మేస్టారి అనుమతి కోసం చూడకుండా కిష్టప్ప బాటరీలైట్ల సహాయంతో మిగతా పిల్లలకి దారి చూపిస్తూ నడిచాడు. మేస్టారు అనుసరించక తప్ప లేదు. అదృష్టవశాత్తు వానజోరు కొంత తగ్గింది.

విరిగి తుప్పుపట్టిపోయిన గేటుతోస్తే కిర్రుమంటూ తెరుచుకుంది. ఎండిపోయిన పచ్చిక జోళ్ళకింద పర పర నలుగుతోంది. దారంటూ లేదు. పాచి పట్టిన రాతి మెట్లెక్కి తలుపు తట్టాడు. రామలింగం మేస్టారికి ఇంత వాన కురిసినా మెత్తబడని ఎండు పచ్చిక విచిత్రంగా తోచింది. బాటరీ లైటు వేసి చూశారు - రంగు పచ్చగానే ఉంది! ఆయనకు భయంలాంటి ఆశ్చర్యం కలిగింది. తలుపు బాదగా బాదగా తెరుచుకుంది. వయసు చెప్పడానికి వీల్లేని ఒక వ్యక్తి చేత్తో హరికెన్ లాంతరు పట్టుకుని గుమ్మంలో నిలబడ్డాడు.

"మా బస్సు దారి తప్పింది. ఈ పక్క సందులో ఆగిపోయింది. బాగు అయేదాకా మేం ఇక్కడ ఉండొచ్చా?" అని అడిగాడు కిష్టప్ప.

వ్యక్తి సమాధానం చెప్పలేదు సరి గదా, గుమ్మంలోంచి తప్పుకోలేదు.

'తమరు కాస్త అనుగ్రహించాలి. పిల్లలు. బయట వాన.' అన్నారు మేస్టారు.

అప్పటికీ ఆ వ్యక్తి తప్పుకోలేదు. కిష్టప్ప ధైర్యంచేసి, అతని పక్కనించి లోపలికి జారాడు. అతని వెనకే సుబ్బు, వెంకటం, గౌరి జారారు. ఇంక మర్యాద కాదన్నట్టు ఆ వ్యక్తి పక్కకి నిలబడ్డాడు. పిల్లలంతా ధైర్యంచేసి లోపలి కొచ్చారు. ఆ వెనక మేస్టారూ వచ్చారు.

'మూగతనేమో పాపం,' అన్నాడు కిష్టప్ప.

వ్యక్తి అతనివంక చూశాడు. ఆ చూపుల్లో చూపు ఉన్నట్టేలేదు. పిల్లలు రవంత బెదిరి కిష్టప్ప వెనక చేరారు.

'ఇదే ఊరు?' అని అడిగాడు మేష్టారు. వ్యక్తి కళ్ళప్పగించి అరగంట చూసినట్టు చూశాడు ఆయనవంక. కిష్టప్ప చెప్పినట్టు అతడు నిజంగా మూగవాడేమోనన్న అనుమానం మేష్టారికి ధ్రువపడుతుండగా, అతడు నోరుతెరిచాడు.

'దుగ్గన్న సత్రం,' అన్నాడావ్యక్తి.

మేష్టారు ఆత్రంగా ఎన్నో ప్రశ్నలడిగారు, ఈ కొండదారి ఎక్కడికి పోతుంది? దగ్గర ఉన్న పట్నం ఏది? ఎంత దూరం? దేనికీ ఆ వ్యక్తి సమాధానం చెప్పలేదు. హరికేన్ లాంతరు చేతపట్టుకుని తనగదిలోకి వెళ్ళిపోయాడు. లాంతరు గుమ్మంలో పెట్టి తన మంచం మీద పడుకున్నాడు. సరే ఈమాత్రమయినా ఆశ్రయం దొరికినందుకు సంతోషించారు మేష్టారూ పిల్లలూ. డ్రైవరూ, వంటవాడూ పక్కబట్టలూ, తిండిసామగ్రీ తీసుకువచ్చారు. బుల్లి పాలెంలో తయారుచేసి తీసుకొచ్చిన సాంబారుఅన్నం, పెరుగు అన్నం, పిన్నలూ పెద్దలూ అందరూ తిన్నారు. నీళ్ళు ఎక్కడున్నాయని కిష్టప్ప వెళ్ళి ఆ వ్యక్తిని అడగాడు. ఆ వ్యక్తి లేచి వచ్చి లాంతరు తీసుకుని దారిచూపించాడు. అది పెద్ద భవంతి. ఎన్నో గదులున్నాయి. అన్నీ బూజుపట్టి దుమ్ముపట్టిపోయి ఉన్నాయి. ఎంతోదూరం నడిచాక, వెనకపక్క వరండాలోకి వచ్చారు ఆ పిల్లలూ ఆ వ్యక్తీ. అక్కడొక పెద్ద నీళ్ళకుండీ ఉంది. పక్కనే ఒక దొక్కి ఉంది. అవి మంచినీళ్ళేనని నిర్ధారణ చేసుకుని, పిల్లలంతా చేతులు కడుక్కొని, నీళ్ళు తాగారు. తెచ్చిన ప్లాస్టిక్ బాల్చీనిండా నీళ్ళుని.పి హాల్లోకి





తీసుకొచ్చారు, మేష్టారికోసం. వ్యక్తి ఈసారి గదిలోకి పోకండా గోడవారని ఉన్న బల్లమీద కూర్చున్నాడు.

'బాబాయి,' అన్నాడు కిష్టప్ప.

ఆ పిలుపుతో ఆ వ్యక్తి కొంత మెత్తబడ్డాడు.అతని ముఖావం సడలింది. కిష్టప్పా మేష్టారూ ఈ ఇంటిని గురించీ దీని ఒంటరితనాన్ని గురించీ ప్రశ్నలు వేశారు-అతను అతి క్లుప్తంగా దీని కథ చెప్పాడు.

రెండువందల ఏభైఏళ్ళ క్రితం దుగ్గన్న సేనాని బీజపూర్ నవాబుకింద సేనాపతిగా ఉండేవాడు. అతని పెళ్ళాం చాలా అందగత్తె అతన్ని యుద్ధ భూమికి పంపి, అతని భార్యని చెర పట్టాడు. విజయం సాధించి తిరిగివచ్చిన దుగ్గన్న సేనానికి ఈ సంగతి తెలిసింది. సైన్యంలో అతనికి పలుకుబడి చాలా ఉండేది. కొందరు నమ్మిన అనుచరులతో నవాబు జనానాలో ప్రవేశించి, తన




భార్యను బలత్కారం చెయ్యబోతున్న నవాబుని నరికేసి, అతని కుటుంబాన్ని నాశనంచేసి, తను రాజయ్యాడు. ఇది అప్పుడు బీజపూరికి రహదారి. ప్రయాణికుల సౌకర్యంకోసం ఈ సత్రం కట్టించాడు. దీని వెనక చాలా అందమైన పూలతోట వేయించాడు. ఆ రోజుల్లో ఎంతో కలకల్లాడుతూ ఉండేది ఈసత్రం. ఇంతలో తెల్లవాళ్ళు ఈ ప్రాంతం క్రమంగా ఆక్రమించడం మొదలుపెట్టారు. దుగ్గన్న సేనానిమాత్రం ఎంతో ధైర్యంతో ప్రతిఘటించాడు– కాని అతని భార్య, బావమరుదులు, ఎలాగా ఓడిపోతామన్న భయంతో, తెల్లవాళ్ళతో కుట్రపన్నారు. అది తెలిసిన దుగ్గన్న భార్యనీ బావమరుదుల్ని చంపేసి, ఈ సత్రంలోకి పారిపోయి వచ్చేశాడు. వెనక తోటలో ఒక చిన్న ఇల్లుంది. ఆ ఇంట్లో దాక్కున్నాడు. ఇక్కడున్న ఆయన నమ్మినబంటు, తెల్లసైన్యాలు సత్రాన్ని చుట్టుముట్టడంచూసి, తోటలో చిన్న ఇంటికి బయట తాళంవేసి, దుగ్గన్న సేనాని అక్కడలేడన్నాడు. తెల్లవాళ్ళు అతన్ని బంధించి పట్టుకుపోయారు– సేనాని ఆ ఇంట్లోంచి బయటపడే దారిలేక, కొన్నిరోజులు ఆకలిదప్పులతో బాధపడి, చచ్చిపోయాడు. ఇప్పుడు దెయ్యమై ఆ తోటలోనూ ఇంట్లోనూ తిరుగుతుంటాడు. దుగ్గన్న దెయ్యం మహా భయంకరమైనది. రకరకాల ఆకారాలు ధరించి, రాత్రిపూట ఆ తోటలో అడుగుపెట్టిన మనుషుల్ని భయపెట్టి చంపుతుంటుంది. యిరవై ఏళ్ళ క్రితం ఒక కలెక్టర్‌గారు ఇలాంటి రాత్రే ఈ సత్రంలో మకాంపెట్టి, ఈ కథంతా విని దెయ్యాలంటే తనకి నమ్మకంలేదని, ఆ తోటలోకి వెళ్ళాడు–తెల్లారేసరికిఆయన శవం కింద లోయలో ఉంది. ఇలాంటివి ఎన్నో కథలున్నాయి.

సగంమంది పైగా పిల్లలకి, మేస్టారికీ భయంతో వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

'ఈ భవనంలోకి కూడా వొస్తుందా ఆ దెయ్యం?' అని అడిగారు మేస్టారు. రాదన్నట్టు తలఊపాడు ఆ వ్యక్తి.

'వెనకాల మంచి పూలతోట ఇంకా ఉందే,' అని అడిగాడు కిష్టప్ప.

'అది తోటకాదు, రెండువందల ఏళ్ళనించీ ఆ మొక్కలకీ పూలతీగెలకీ ఎదుగూ బొదుగూ లేదు. ఆ దెయ్యం స్పర్శకి అవన్నీ రాళ్ళుగా మారిపోతుంటాయి. రాత్రి గుడ్డివెలుగులో అవన్నీ పూలమొక్కల్లాగ కనిపిస్తాయి. పగలు చూద్దురుగాని, ఆకులూ రెమ్మలూ అన్నీ రాళ్ళు,' అన్నాడు వ్యక్తి.

'అ, అదంతా కట్టుకథ, ఎవడో మహాశిల్పి ఆ మొక్కలూ లతలూ అతి సున్నితంగా చెక్కి ఉంటాడు,' అన్నారు రామలింగం మేస్టారు.

'అవి శిల్పాలు కావు, రాళ్ళయిపోయిన పూలమొక్కలు. అవి తాకితే తెలుస్తుంది. చెయ్యికూడా గడ్డకట్టుకుపోతుంది,' అన్నాడు వ్యక్తి.

రామలింగం మేస్టారికి ఈ కథలన్నీ నమ్మాలనిలేదు. కాని తను నమ్మడం లేదని ఆ దెయ్యానికి తెలిస్తే, తనమీద విజృంభిస్తుందేమోనని భయం. ఎందుకైనా మంచిదని, సింహద్వారం తెరిచే ఉంచి, పారిపోడానికి వీలుగా గుమ్మం దగ్గర పక్కపరుచుకున్నా రాయన. కుర్రవాళ్ళందరినీ తెల్లవారకుండానే లేవాలని హెచ్చరించి, ఆయన నడుం వాల్చారు.పిల్లలంతాకూడా పడుకున్నారు. ఆ వ్యక్తి తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు – క్రమంగా అందరికీ నిద్రపట్టింది.

కాని కిష్టప్పకుమాత్రం ఆ కథే బుర్రలో తిరుగుతోంది. ఆ దెయ్యాన్ని చూడాలని గట్టి కోరిక. రవంత భయం కూడా. కాని కుతూహలం. ఆ మొక్కలన్నీ నిజంగా రాళ్ళయిపోయినవేనా?

ఇంతలో సన్నగా ఏ పక్కనించో విచిత్రమైన ధ్వని వచ్చింది. చెవులు నిక్కించి విన్నాడు. ఈ లోకంలో విన్నచప్పుడులా లేదు– ఆవు అరుపు సింహం గర్జన కాకుండా రెండూ కలిసినట్లుంది ఆ ధ్వని. మెల్లిగా లేచాడు. అతని వెనక సుబ్బు, వెంకటం, గౌరికూడా లేచారు. వాళ్ళూ నిద్రపోలేదు అతనిలాగే–నలుగురూ పిల్లల్లాగ బాటరీ లైట్లసహాయంతో వెనక వరండా చేరుకున్నారు–చూశారు.

వందగజాల అవతల మరో ఆవరణ ఉంది. రాళ్ళతో కట్టిన ప్రహరీ ఉంది దానికి. అదే రాతిమొక్కల తోపై ఉంటుంది. నలుగురూ ధైర్యంచేసి ఆ వైపు నడిచారు. గేటు లేదు, కాని ఆ చోట కంప అడ్డంగా ఉంది. అది మెల్లిగా తొలిగించారు. వాళ్ళు ఆ తోటలో అడుగు పెట్టడంతోటే, విచిత్రమైన వెలుగు, వెన్నెలకాని వెన్నెల లాంటిది తోటంతా ఆవరించింది, ఎవరో స్విచ్చి నొక్కినట్టు. ఆ వెలుగులో తోట ఎంతో అందంగా ఉంది. లతల కొసల్లో పువ్వులు ఎవరో శిల్పి తీర్చిదిద్దినట్లు న్నాయి. రవంత గాలి వీస్తున్నా, లతలు మాత్రం ఊగడంలేదు. ఒక చెట్టుమీద పిట్టకూడా కూచ్చుని ఉంది. కిష్టప్ప దాని మీదికి రాయి విసిరాడు, గురిచూసి. తగిలింది. కాని పిట్ట ఎగిరిపోలేదు రాయి రాతికి తగిలిన చప్పుడుమాత్రం వినపడింది. ధైర్యంచేసి, కిష్టప్ప, ఒక పువ్వు కొయ్యబోయాడు. గట్టిగా రాయిలా తగిలింది చేతికి! మంచుకన్న తీవ్రమైన చల్లదనం అతని శరీరంలోకి విద్యుత్తులా ప్రవహించింది. చటుక్కున చెయ్యి వెనక్కి తీసుకుని రెండోచేత్తో వేడి పుట్టేదాకా రాసుకున్నాడు - మిగతా ముగ్గురూ బిత్తరపోయి చూశారు— ఇంతలో పెద్ద వింత శబ్దం. చటుక్కున అందరూ అటు చూశారు.

పెద్ద బస్సు అంత ఆకారం ఏదో తమవంక వస్తోంది. సింహం నోట్లో సగం ఆవు. ఆవు ముందుకాళ్ళు గాలిలో గిలగిల కొట్టుకుంటున్నాయి. పెద్ద గుహలాగుంది ఆవు నోరు. నలుపు ఎరుపు ఆకుపచ్చరంగులు దాని వంటి మీద మారిపోతున్నాయి. గుహలోంచి వచ్చినట్టు పెద్ద గంభీరమైన గొంతు.

'కుర్రకుంకల్లారా! మా తోటలో అడుగుపెట్టడానికి మీకు ఎన్ని గుండె లున్నాయి,' అంటూ ఆ ఆకారం వాళ్ళ



మీదికి ఉవ్వెత్తుగా వచ్చిపడింది. నలుగురూ ఒకరికొకరు గట్టిగా పట్టుకు నిలబడ్డారు. పారిపోడానికికూడా కాళ్ళు రాలేదు వాళ్ళకి. ఆ ఆకారం వాళ్ళని దూసుకుని తూపానుగాలిలా వెళ్ళి పోయింది.

కిష్టప్పకి భయం పోయింది. దెయ్యం మంచే వట్టిగాలి, గాలి తమని ఏంచెయ్య గలదు? భయపెడుతుంది, అంతే. కాని సుబ్బు, వెంకటం, గౌరి తోట అవతలికి పారిపోయారు. కాని కిష్టప్ప రావడం లేదని చూసి ఆగిపోయారు. కిష్టప్ప తోటంతా పరీక్షగా చూడ్డం మొదలు పెట్టాడు. చాలా పెద్ద తోట. ఎన్నో రకాల మొక్కలుండేవి, ఇప్పుడన్నీ రాళ్ళయిపోయాయి. చిన్న ఇల్లు, దాని మీద ఒక పెద్ద నీళ్ళకుండీ, ఆ నీళ్ళ కుండీలోంచి ఇందాకా కురిసిన వాననీళ్ళు ధారగా కిందికి కారుతున్నాయి. ఆ నీళ్ళు చక్కగా రాళ్ళతోకట్టిన బోదుల ద్వారా మొక్కల్లోకి పారుతున్నాయి. అన్ని మొక్కలకీ చుట్టూ పాదులుచేసి ఉన్నాయి. నీళ్ళు ఆ పాదుల్లో నిండి పొర్లి మరో బోదిలో పడుతున్నాయి. ఆ బోదినీళ్ళను మరో మొక్కకి మర్లి స్తోంది. చాలా బాగా కట్టిన బోదులు. ఇంతలో దుగ్గన్న దెయ్యానికి మళ్ళీ కోపంవచ్చింది. ఇంత సాహసించిన కుర్రకుంకని బెదిరించి రాయిగా మార్చెయ్యాలని తీర్మానించుకుంది.

కిష్టప్ప తనమీదికి వస్తున్న దెయ్యంవంక చూశాడు. దెయ్యం ఈసారి పెద్ద రైలు ఇంజను అవతారం దాల్చింది. దానికి ఎఱ్ఱటి మంటలు పొగలు కక్కుతున్న నోరుంది. ఆ నోరు తెరుచుకుని ఇంజను అతనిమీదికి వచ్చింది. అతనప్పుడు ఒక బండరాయిమీద ఎక్కిఉన్నాడు ఇంజను మీదికి వచ్చిపడుతుంటే, అతను వెనక పక్కకి దూకి నేలమీద పడుకున్నాడు. ఇంజను రాయికి తగిలి రెండుగా చీలి, రెండు బండరాళ్ళకు ఢీకొని, చప్పగా రంగులుమారుతూ నేలమట్టం అయిపోయింది. కొంతసేపు కదల్లేదు. కిష్టప్ప మళ్ళీ సురక్షితంగా లేవడంచూసి, మిగతా ముగ్గురూ ధైర్యంచేసి లోపలికొచ్చారు మెల్లగా దెయ్యం పడిపోయిన చోటికి వచ్చారు – దెయ్యం మెల్లగా మనిషి ఆకారం దాలుస్తోంది. బిత్తరపోయి చూశారు నలుగురూ. దెయ్యం మనిషిగా మారింది. అయినా పూర్తిగాకాదు — గాజులాంటి దూదితో చేసినట్టుంది ఆకారం. తలవంచుకుని, రాతికి జేర్లబడి కిందికిచూస్తూ కూచుంది దెయ్యం.

'దుగ్గన్న సేనాని మీరేనాండీ,' అన్నాడు కిష్టప్ప.

మెల్లగా తలెత్తి వాళ్ళవంక చూసింది దెయ్యం. ఔనన్నట్టు తలఊపింది. బాధగా నిట్టూర్చింది.

'ఎందుకండి ఏదో బాధపడుతున్నన్నాట్టున్నారు?' అని అడిగాడు కిష్టప్ప.

'నా పరువంతా నువ్వు మంటకలిపేశావురా కుఱ్ఱకుంకా! రెండువందల ఏళ్ళుగా ఎందరు మహావీరుల్ని హడలగొట్టేశాను! ఎందర్ని భయపెట్టి చంపేశాను! వేలెడులేవు. నా భయంకరాకాలకు తట్టుకుని ధైర్యంగా నిలబడ్డావు. ఇంకేముంది? నన్ను చూసి మనిషన్నవాడు ఎందుకు భయపడతాడు? ఇంత గొప్ప దెయ్యమై లాభం ఏముంది?'

కిష్టప్పకి జాలివేసింది.

'సార్! మీరసలు మనుషుల్ని ఎందుకు భయపెట్టాలి?'

'మరింక దెయ్యంకావడం ఎందుకు? అయి ప్రయోజనం ఏమిటి? పైగా మనుషులు నన్ను చూసి భయపడి ప్రాణాలు విడుస్తుంటే నాకెంతో సరదాగా తృప్తిగా ఉండేది. అదికూడా లేకపోతే ఇంక దెయ్యంగా ఎలా బతికేది? నాకింక రాత్రుళ్ళు ఎలా గడుస్తాయి?'

'మనుషుల్లాగ మీరు కూడా హాయిగా మెత్తని పరుపుమీద వెచ్చగా పడుకుని నిద్రపోకూడదూ?'

'నిద్రా? దెయ్యానికా?' దెయ్యం బరువుగా నవ్వింది.

తరవాత మెల్లగా అంది–

'నాకు వెచ్చని పరుపు ఏదో తెలుసా? ఊరిబయట, ఏటిఒడ్డున, కట్టెలుపేర్చి నాకు పరుపు ఏర్పాటయి ఉంది. నేను పడుకున్నాక అది అంటించాలి. ఆ వెచ్చని మంటల దుప్పటి కప్పుకుని నేను శాశ్వతంగా నిద్రపోవాలి. అంతవరకు నాకు నిద్రలేదు, మెలకువలేదు. నేను బ్రతికీ లేను, చచ్చీ లేను. చావు బ్రతుకులమధ్య ఇలా ఊగులాడుతూ శాశ్వతంగా ఉండిపోవలసిందే. నాకీ స్థితినించి విడుదల లేదు?'

కిష్టప్పకి మిత్రులకీ కళ్ళనీళ్ళు తిరిగాయి–గౌరి అంది–

'తాతగారూ! మేం కట్టెలు పేర్చి మీకు పరుపు ఏర్పాటుచేస్తామండి.'

దెయ్యం ముఖంలో రవంత ఆశ, వెంటనే నిరాశ. మీవల్ల కాదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు. కిష్టప్ప అడిగాడు.

'సార్! మీరు బతికున్నప్పుడే చాలా మందిని చంపేశారట మరి అది పాపం కాదండీ!'

'పాపం! .... మీరు అమాయకులు. పాపం అనే మాటే మీకు తెలుసు. అర్థం తెలియదు. అందుకే నన్ను చూసి మీరు భయపడలేదు. మీ మనస్సుల్లో పాపం ఉంటే, మీ పెద్దల్లాగే మీరూ నన్నుచూసి హడలి చచ్చిపోయిఉందురు. రెండువందల ఏళ్ళుగా లోకాన్ని చూస్తున్నాను, అంతకంతకూ పాపం పేరుకుని లోకంలో గడ్డకట్టుకుపోతోంది. స్వార్థం, దుర్మార్గం, క్రౌర్యం, ఇవే లోకాన్ని నడిపిస్తున్నాయి. అనాదినించీ అంతే. మంచితనాన్ని చంపెయ్యడం మనిషి లక్ష్యం. మంచిమాట చెప్పినందుకేగా క్రీస్తుని శిలువమీద చంపేశారు! మహమ్మదుని రాళ్ళతో కొట్టి హింసించారు. నిన్నగాక మొన్న బాపూజీని కాల్చి చంపేశారు! దేశం కోసం త్యాగాలు చేసిన పెద్దలంతా స్వాతంత్రం వచ్చాక దేశాన్ని దోచుకు తింటున్నారు–నిజమే. నేను చాలా ఘోరాలు చేశాను, నా మీదా ఎందరో ఎన్నో ఘోరాలు చేశారు. కాని, ఒక మనిషిని హత్య చేస్తే హంతకుడికి ఉరిశిక్ష వేస్తారు, లేదా యావజ్జీవ కారాగారం వేస్తారు. అదయినా ఏ పదిపదిహేనేళ్ళో. ఆ తరవాత హంతకుడు హాయిగా చచ్చిపోతాడు. నేనో, చావూ కాని, బ్రతుకూ కాని, ఈ దెయ్యం రూపంలో రెండు వందల ఏళ్ళుగా శిక్ష అనుభవిస్తున్నాను. ఇంకా ఎన్ని వందల ఏళ్ళు నేనిలా గడపాలో. ఈ ఒంటరితనం ఎలా భరించేది? అందుకే ఈ తోటని దెయ్యపు తోటగా మార్చేశాను, కసికొద్దీ. ఈ మొక్కలకు చావూ లేదూ బ్రతుకూ లేదు. ఈ తోటలో ఉన్న పువ్వులకీ పిట్టలకీ కూడా అదే గతి. నేను వాయురూపంలో ఉన్న దెయ్యాన్ని, అవి ఘనరూపంలో దెయ్యాలు. నా తోడుకోసం తాకినదంతా దెయ్యంగా మార్చెయ్యాలని నా కోరిక. వీలయితే ఈ స్వార్థపరుల

లోకాన్నంతా దెయ్యపు లోకంగా మార్చెయ్యాలని. ఈ క్షణం వరకూ ఈ లోకంలో మంచితనం, ధైర్యం, అమాయకత్వం ఉన్నాయని నేననుకో లేదు. ఉన్నాయని మీ ద్వారా నా కర్థ మయింది.... ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఎలా ఈ స్థితినుంచి బయటపడాలి? ఎలా శాశ్వత నిద్రలో మునిగిపోవాలి? మిమ్మల్ని చూశాక, లోకాన్ని మీ కోస మన్నా మిగల్చాలనిపిస్తోంది. నేను చచ్చిన దెయ్యాన్ని. మీ లోకంలో బతికున్న దెయ్యాలున్నాయి. పెరిగి పెద్ద వాళ్లై మీరూ ఆ దెయ్యాల్లో ఒకరై పోతారని నా భయం. మీ అమాయకత్వం ఇలాగే వర్ధిల్లి లోకాన్ని మీరు మార్చెయ్యాలనీ మంచితనానికి స్థావరంగా చెయ్యాలనీ నా కోరిక. ఏది నిజమౌతుందో నాకు తెలియదు. అందుకే నాకేం పాలు పోవడంలేదు –"


గౌరి కిదంతా అర్థంకాకపోయినా దెయ్యంతాత ఎందుకో చాలా బాధపడు తున్నాడని గ్రహించింది.

'తాతా! నీకు పరుపు మేం ఏర్పాటు చేస్తాం. ఈ తోటని మాత్రం మామూలుగా చెయ్యి. వెనకటిలాగా పూలతో పిట్టలతో ఉంటే ఎంతో బాగుంటుంది. రా తాతా! నా చెయ్యి పట్టుకో. ఈ తోటలో కట్టెలు లేవు. అవతల నీకు కట్టెలతో పరుపు వేసి వెచ్చగా అంటిస్తాం. రా తాతా! రా మరి!'

దెయ్యం కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ పసిపాప చెయ్యి పట్టుకుంది. నడవడం మొదలుపెట్టింది ఈలోగా నిద్రపోతున్న పిల్లలంతా ఒకరొకరే లేచి వచ్చారు. తోట ఆవరణకి అవతల కట్టెలతో చితి పేర్చారు. కిష్టప్ప లాంతరు పట్టు కొచ్చాడు గౌరి అలిసిపోయిన దెయ్యం తాతని చితిమీద పడుకోపెట్టారు. కిష్టప్ప లాంతరు చిమ్నీ తీసి చితి అంటించాడు. వెచ్చని మంటల్లో సగం మగతనిద్రలోకి పోతున్న దుగ్గన్న సేనాని దెయ్యం అంది–

'నా చేతులతో ఆనాడు వేసిన తోట నేనే దెయ్యపుతోటగా మార్చేశాను. నే నింక విముక్తి పొందుతున్నాను. నాతో పాటు ఈ తోట విముక్తి పొందుతుంది. నేను శాశ్వత నిద్రలో చావును చేరు కుంటాను. ఈ రాతిమొక్కలు, లతలు, పువ్వులు, పిట్టలు, బ్రతుకును చేరుకుం టాయి. కలకల్లాడుతూ వెనకటిలాగ అయిపోతుంది తోట. కాని....స్వార్థం ఏమాత్రం మనస్సులో ఉన్నవాళ్లకయినా, ఇది రాతితోటే. అమాయకులైన పిల్లలకే ఇది సజీవంగా కనిపిస్తుంది. మీలాంటి పిల్లలే .... రాతితోటలాంటి లోకానికి తిరిగి ప్రాణం పొయ్యాలి....'

దుగ్గన్న సేనాని దెయ్యం, మంటల్లో వెలుగుగా మారిపోయింది. తోటంతా పిట్టలు కిలకిలమంటూ ఎగురుతున్నాయి. పువ్వులు కలకల్లాడుతున్నాయి, అనేక రంగులతో. పిల్లలు ఆనందంగా ఆ తోట మధ్య గంతులేస్తూ తిరుగు తున్నారు.




కాని —

వాళ్ళని వెతకడానికి వచ్చిన రామ లింగం మేస్టారికీ, డ్రైవరుకీ, వంటవాడికీ రాతిమొక్కలే, రాతిపువ్వులే, రాతి పిట్టలే కనిపించాయి.